బీజేపీ.. మతతత్వ పార్టీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

యాలాల, ఏప్రిల్ 27 : బీజేపీ.. మతతత్వ పార్టీ అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని కోకట్, పడిగ్యాల, ముద్దాయిపేట, యాలాల, దేవనూర్, బెన్నూర్, జుంటుపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతతత్వ పార్టీతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నల్ల చట్టాలతో రైతుల నడ్డి విరిచిందన్నారు. దేశాన్ని భ్రష్టు పట్టించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. మతం, గుడి పేరుతో ఓట్లు అడగడానికి మన ముందుకొస్తున్న వారికి బుద్ధి చెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, జిల్లా కో ఆప్షన్ అధ్యక్షుడు అ క్బర్ బాబా, శ్రీధర్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని నిరసన

పెద్దేముల్, ఏప్రిల్ 27 : మండల పరిధిలోని అడికిచెర్ల పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని పలువురు కాలనీవాసులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శనివారం పలువురు కాలనీవాసులు ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. ఆయన వినతిపత్రం తీసుకోకపోవడంతో పాటు ఈ సమస్య మా డిపార్ట్‌మెంట్‌ది కాదని వారితో వాగ్వాదానికి దిగారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై డీపీవో జయసుధకు ఫోన్ చేసి పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ జర్నప్ప విద్యుత్ ఏఈ రఘువీర్‌కి ఫోన్ చేసి సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. స్పందించిన ఏఈ లైన్‌ఇన్‌స్పెక్టర్ రాములును పంపి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించడంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ, ఏప్రిల్ 27 : స్నేహితుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం చెంచు కాలనీకి చెందిన కుక్కల అంజిలయ్య మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న పదో తరగతి బ్యాచ్ స్నేహితులు అంజిలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.14,100 ఆయన అంత్యక్రియలకు అందజేశారు. అలాగే కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో అంజిలయ్య పదో తరగతి స్నేహితులు, ట్రస్టు సభ్యులు శరత్‌కుమార్‌రెడ్డి, లింగయ్య, జమీల్, శ్రీనివాస్, తాజుద్దీన్, అంజిలయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం..

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 27: మండల పరిధిలోని చాపలగూడెం గ్రామానికి చెందిన చిట్టెల లక్ష్మయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించి రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకోసం ట్రస్టు ఆధ్వర్యంలో తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ గుండె చప్పుడు.. బీఆర్ఎస్

ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27 : తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమం నుంచి నేటి వరకూ కాంగ్రెస్ పార్టీ హయాంలో తెలంగాణకు అడుగడుగునా మోసమే జరిగిందని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి..అనంతరం జరిగిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణను ఆంధ్రలో కలిపి మొదటి మోసానికి తెరతీసిందే కాంగ్రెస్ పార్టీ అని..తొలి దశ ఉద్యమంలో 369మంది తెలంగాణ ఉద్యమకారులను కాల్చిచంపిందన్నారు. పెద్దమనుషుల ఒప్పందం, ఫజల్‌అలీ కమిషన్ సిఫార్సులు, 610 జీవోలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ నాలుగు నెలల వ్యవధిలోనే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నదన్నారు. హామీలను నెరవేర్చకుండా.. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే తెలంగాణ ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ వీడిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, జడ్పీటీసీ జంగమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, కిషన్‌గౌడ్, రమేశ్, రమేశ్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు జంగయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్, కల్యాణ్‌నాయక్, రాంరెడ్డి, యాదగిరి, నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, జగదీశ్వర్, ప్రసాద్‌గౌడ్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యకు తొలిమెట్టు అంగన్‌వాడీలు

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న సీడీపీవో నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

కొత్తూరు, ఏప్రిల్ 27: చిన్నారులకు విద్యనందిచే తొలిమెట్టుగా అంగన్‌వాడీలు నిలుస్తాయని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి అన్నారు. నందిగామ మండల పరిధిలోని 1, 2 ,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ సీడీపీవో నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆరేండ్లు నిండిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, విజయపద్మ, జ్యోతి, సంధ్య, వెంకటమ్మ, దివ్య, ఆండాలు, శమంతకమణి, విజయలక్ష్మి,శివరాణి, జ్యోతిక రేవతి పాల్గొన్నారు.

కుమార్తెలతో కలిసి తల్లి అదృశ్యం

యాచారం, ఏప్రిల్ 27 : ముగ్గురు పిల్లలతో కలిసి ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ నరసింహరావు కథనం ప్రకారం ..కందుకూరు మండలంలోని ఆకుల మైలారం గ్రామానికి అనుబంధంగా ఉన్న మాలగూడ గ్రామానికి చెందిన వలవోజు నరసింహ భార్య పరమేశ్వరి (27) తన కుమార్తెలు దీపిక, అక్షిత, శ్రీనిధిలతో కలిసి ఇంట్లో ఎవరికి చెప్పకుండా నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. నరసింహ వారి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుమార్తెలతో కలిసి అదృశ్యమైన పరమేశ్వరి (ఫైల్)

అలిన్ ఫార్మాలో అదుపులోకి రాని మంటలు

అలిన్ ఫార్మాలో మెయిన్ బిల్డింగ్‌కు వ్యాపించిన మంటలు

- అర్ధరాత్రి మెయిన్ బిల్డింగ్‌కు వ్యాప్తి
- ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలు ఆర్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్న సిబ్బంది
- మెయిన్ బిల్డింగ్ కింది ఫ్లోర్‌లో పెద్ద మొత్తంలో కెమికల్స్
- మంటలు కింది ఫ్లోర్‌కు వ్యాపిస్తే బ్లాస్ట్ అయ్యే అవకాశం
- రూ. 25 కోట్ల వరకు ఆస్తి నష్ట జరిగిందంటున్న పరిశ్రమ యాజమాన్యం

కొత్తూరు, ఏప్రిల్ 27 : నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదం మరింత తీవ్రమయింది. నిన్న రాత్రి వరకు మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. మధ్యరాత్రి మంటలు మెయిన్ బిల్డింగ్‌కు వ్యాపించాయి. దీంతో వాటిని ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మంటలు అదుపులోకి వచ్చినట్టే వచ్చి మళ్లీ చెలరేగాయి. అందులో ఉన్న కెమికల్స్ మళ్లీ అంటుకుంటుండంతో మంటలు అదుపులోకి రావడం లేదని ఫైర్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో సిబ్బందికి ఏం చేయాలో పాలు పోవడంలేదు. అయితే శనివారం వరకు కూడా మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. పరిశ్రమ గ్రౌండ్ ఫ్లోర్‌లో పెద్ద మొత్తంలో కెమికల్స్ ఉన్నాయని పరిశ్రమ యాజమాన్యం చెప్పింది. ఒక వేళ ఆ మంటలు గ్రౌండ్ ఫ్లోర్‌కు వ్యాపిస్తే బిల్డింగ్ మొత్తం బ్లాస్ట్ అయ్యే అవకాశం ఉందని ఫైర్ సిబ్బంది చెబుతున్నారు. రూ.25 కోట్ల వరకు నష్టం జరిగిందని పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా పాత జాతీయ రహదారి ఓ వైపు పూర్తిగా క్లోజ్ చేశారు. సాయంత్రానికి మంటలు కొంచెం తగ్గడంతో రోడ్డును తిరిగి పునరుద్ధరించారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

యాచారం, ఏప్రిల్ 27: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. సీఐ నరసింహరావు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని తాటిపర్తిలో వెంకటమ్మకు చెందిన కిరాణా షాప్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. 13 బీర్లు, 9 క్వార్టర్స్, 16ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, మా క్లయింట్లు కొత్తపల్లి నర్సింహ మరియు 9 మంది ఇతరులు, నివాసం: కొత్వాల్‌గూడ, శంషాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం సర్వే నం. 438, విస్తీర్ణం ఎ. 4-00 గుంటలు, కవ్వగూడ (మర్లగూడ రోడ్డు), ఇట్టి భూమిపై 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ కోర్టులో ఐ.ఎ.నం. 410/2022 ఇన్ ఓ.ఎస్.నం. 468/2022 దావా నడుచుచున్నది. మరియు కోర్టువారు ఇన్‌జెక్షన్ ఆర్డరు ఇచ్చియున్నారు. కావున, పై తెలుపబడిన భూమిపై యావత్ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించున్నది ఏమనగా, పై తెలుపబడిన కోర్టు ఆర్డరు అతిక్రమణ చేయకుండా హెచ్చరించబడినది. పై తెలుపబడిన భూమిని అక్రమంగా కబ్జా చేసిన వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు వేయబడునని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది.

సం/- వి. శేషగిరిరావు, నరసిముడు,
అడ్వకేట్లు, ఆఫీసు నం.1, ముంబై కాంప్లెక్స్, మెగా థియేటర్ ప్రక్కన, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 059,
ఫోన్ నం. 9505450729

ఓటు హక్కును వినియోగించుకోవాలి

దోమ: నిజాయితీగా ఓటును వినియోగించుకుంటామని ఓటర్లతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు

- ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం
- ఓటర్లకు అవగాహన సదస్సు

దోమ, ఏప్రిల్ 27 : ఓటు హక్కు అమూల్యమైనదని, దానిని తప్పకుండా వినియోగించుకోవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. దోమ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చే శారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అ వగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓటర్లు మద్యం, డబ్బు ఇతరత్రా ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటును వినియోగించుకొని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలని తెలిపారు. ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించేందుకు మన రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వీధు ల గుండా ర్యాలీ నిర్వహించారు. గ్రామ రచ్చకట్ట వద్ద ఓటును నిజాయితీగా ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగిస్తామని ఓటర్లతో అధికారులు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఏపీఎం సురేశ్, సీసీలు జంగయ్య, నర్సింహులు, వీవోఏలు మాధవి, భాగ్య, మౌనిక, చంద్రశేఖర్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల : చౌడాపూర్‌లో ఓటరు స్లిప్పులను అందజేస్తున్న తహసీల్దార్ ప్రభు

ఓటు హక్కు వజ్రాయుధం

కులకచర్ల : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలా పని చేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు తెలిపారు. శనివారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు చాలా ముఖ్యమైనదని తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లకు అనుకూలంగా ఉండేలా పోలిం గ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే స్వప్నం సాకారమైంది..

ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 27 : ఎన్నో ఏండ్లుగా అణచివేతకు గురైన తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని బీఆర్ఎస్ పార్టీ నెరవేర్చిందని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమకారుల పోరాట ఫలితంగానే స్వప్నం సాకారమైందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషిని ఆయన కొనియాడారు. రాష్ట్రాన్ని సాధించిన ఆయన తెలంగాణను పదేండ్లకాలంలో అన్ని రంగాల్లో ముందుంచారన్నారు. గ్రామాలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ప్రజల గుండెల్లో చిరకాలం గుర్తుండే మహానాయ కుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, కృష్ణారెడ్డి, రామస్వామి, రాములు, కృష్ణ, అనంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

యాలాల, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ పార్టీ త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ అని పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ సిద్ధాంత కర్త జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పార్టీ స్థాపించి 23 ఏండ్లు పూర్తయిన శుభ సందర్భంగా పార్టీ నేతలు, శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిన ఘనత బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రపంచ రాజకీయ పార్టీ చరిత్రలో బీఆర్ఎస్‌ది ప్రత్యేక స్థానమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

మొయినాబాద్, ఏప్రిల్ 27 : చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేయడానికి ఆదివారం బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ గౌడ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రంలోని సురంగల్ గ్రామానికి వెళ్లే రోడ్డులోని ఉన్ప స్టార్ కన్వెషన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి పి. సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ముఖ్యనాయకులతో పాటు గ్రామాల్లో ఉండే పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీధి నాటకం వాల్‌పోస్టర్ విడుదల

మోత్కూర్‌లో వీధి నాటకం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

దోమ, ఏప్రిల్ 27 : మండల పరిధిలోని మోత్కూర్‌లో మే 3 నుంచి వేంకటేశ్వర మహత్యం వీధి నాటకం ప్రారంభం కానున్నదని నాటకోపాధ్యాయుడు తెలిపారు. ఈ నాటకానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మల్లేశ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, బిచ్చయ్య, నర్సింహులు, అంజిలయ్య. నాటక పాత్రదారులు తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్తూ ఇద్దరి దుర్మరణం

డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టిన కారు

ప్రమాదానికి గురయిన కారు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 27: రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొన్నది. వినోదం కోసం హుషారుగా బయలుదేరిన స్నేహితుల్లో ఇద్దరు కన్నుమూశారు. ఈ విషాద ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లోని సూర్యానగర్ కాలనీకి చెందిన క్రితిక్‌గౌడ్ (14), గోపి (18), మరో ముగ్గురు స్నేహితులు కలిసి కారులో హయత్‌నగర్ నుంచి సంఘీలోని ఆలయానికి బయలుదేరారు. గోపి వాహనం నడుపుతున్నాడు. విజయవాడ జాతీయ రహదారి నుంచి సంఘీ రోడ్డులోకి వెళ్లగానే మార్గమధ్యంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో క్రితిక్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందారు. గోపికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గోపి కూడా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్నీ గమనించగలరు.